



హైదరాబాద్ వార్త









# అమ్మ బైలెల్లినాదో..

## గోల్కొండ బోనాల సందడి షురూ..

హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త : గోలుకొండ కోటలో కొలువైన జగదాంబిక మహంకాళి ఎల్లమ్మకు తొలిబోనం చెల్లడంతో సిటీలో ఆషాఢమాస బోనాల జాతర షురూ అయ్యింది. శివసత్తుల ఆటలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు దరువులు, భక్తుల కోలాహలంతో గురువారం గోల్కొండ కోట దద్దరిల్లింది. ఘటాల ఊరేగింపు కార్యక్రమం అట్టహసంగా ప్రారంభమైంది. లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ జగదాంబిక ఆలయం వరకు జరిగే ఊరేగింపు కోసం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.కాగా, చారిత్రాత్మక గోల్కొండ కోట పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. అయితే, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు జగదాంబిక అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తలపై బోనమెత్తి, వర్షంలో తడుస్తూనే భక్తజనం అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో తరలివచ్చారు.





## ఘనంగా జగన్నాథ రథయాత్ర

-హాజరైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ





జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ముషీరాబాద్, జులై 16, ప్రభాతవార్త: హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ దేవాలయ నిర్వాహకులు ప్రతి సంవత్సరం నిర్వహించే జగన్నాథ రథయాత్ర కార్యక్రమం ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి ఘనంగా ప్రారంభమయింది. గురువారం ఉదయం రంగు రంగుల రంగవల్లికలతో, భక్తుల భజన కీర్తనలు, నృత్యాలు, కోలాటాల నడుమ ఎంతో అంగరంగ వైభవంగా ఈ యాత్ర ప్రారంభమయింది. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి విగ్రహాలతో కూడిన రథంను పూలతో అలంకరించి, వేలాది మంది భక్తుల భజన సంకీర్తనలతో ప్రారంభమయిన ఈ రథయాత్రలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ మహిళా నేత రమ్యారావ్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జగన్నాధుని ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంత పెద్ద ఎత్తున ఎంతో వైభవంగా రథయాత్ర నిర్వహిస్తున్న ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులను, వాలెంటీర్లను ఆయన అభినందించారు.

## మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్.. హైదరాబాద్ రానున్న అదనపు కోచ్‌లు

హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త : మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది.ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్ఎంఆర్ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు.ప్రయాణికులకు మెరుగైన సేవలు, భద్రతతో పాటు స్టేషన్ల పరిశుభ్రతకు తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు.

## మద్యం మత్తులో అడ్డా కూలీ దారుణ హత్య..!

పేట్ బషీరాబాద్, జూలై 16, ప్రభాతవార్త

హైదరాబాద్ శివార్లలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేగింది. కొంపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ కింద ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో అడ్డా కూలీల మధ్య జరిగిన ఘర్షణే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ప్రాంతానికి చెందిన బైరి నర్సింహులు (35) బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. కొంపల్లి పరిసర ప్రాంతాల్లో నివసిస్తూ, స్థానిక లేబర్ అడ్డాపై రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఎప్పటిలాగే బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత (సుమారు ఒంటి గంట సమయంలో) కొంపల్లి ఫ్లైఓవర్ కింద కొందరు అడ్డా కూలీలు మద్యం సేవించారు. ఈ క్రమంలో మద్యం మత్తులో నర్సింహులుకు, అక్కడ ఉన్న మరో వ్యక్తికి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ గొడవలో అవతలి వ్యక్తి నర్సింహులుపై తీవ్రంగా దాడి చేయడంతో, అతను తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం ఉదయం ఫ్లైఓవర్ కింద మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పేట్ బషీరాబాద్ సీఐ విజయ్ వర్ధన్, ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సహాయంతో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు.మద్యం మత్తులో జరిగిన గొడవే ఈ హత్యకు దారితీసింది. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, నిందితుడిని పట్టుకునేందుకు దర్యాప్తును వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాటా పేరుతో రూ.1.80 కోట్ల మోసం

జూబ్లీహిల్స్, జూలై 16, ప్రభాతవార్తః

సాఫ్ట్‌వేర్ కంపెనీలో 50 శాతం వాటా ఇస్తానని నమ్మించి దంపతుల నుంచి రూ.1.05 కోట్ల పెట్టుబడులు తీసుకుని మోసం చేసిన ఘటనపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పినైట్ ఇన్ఫో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పమిడి నవీన్ కుమార్ యాదవ్ కంపెనీలో 50 శాతం వాటా ఇస్తానని చెప్పి 2020-21 మధ్య వట్టినాగులపల్లికి చెందిన మేకపాటి వెంకట రమణయ్య, నాగేశ్వరి దంపతుల నుంచి రూ.1.05 కోట్ల పెట్టుబడులు తీసుకున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా రూ.1.80 కోట్లకు సెటిల్‌మెంట్ డీడ్ చేసుకుని పలు చెక్కులు ఇచ్చినప్పటికి అవన్నీ ఖాతాలో నిధుల లేమి కారణంతో బౌన్స్ అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ల 316(2), 318(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాచారం పెద్ద చెరువు పునరుద్ధరణకు హైడ్రా శ్రీకారం



చెరువు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రంగనాథ్

నాచారం, జులై 16 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని నాచారం పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా గురువారం శ్రీకారం చుట్టింది. 108.30 ఎకరా ల విస్తీర్ణంలో ఉన్న చెరువు అభివృద్ధి పనులను గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు.దాదాపు రూ.28 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో చెరువు కట్టను బలోపేతం చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్, విశ్రాంతి వేదికలు, పిల్లల ఆట స్థలాలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, యోగా వేదికలను ఏర్పాటు చేయనున్నారు. చెరువులో సుమారు 10 అడుగుల మేర పూడిక తొలగించి, పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కమిషనర్ తెలిపారు. చెరువు పునరుద్ధరణతో వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, మురుగునీటి సమస్యల నివారణతో పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, బీజేపీ నాయకులు మల్లెల నర్సింగ్ రావు, రాగిరి మోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొ న్నారు. అదేవిదంగా కాంగ్రెస్ నాయకులు భావనాగౌడ్, శ్రీకాంత్ గౌడ్ తధితరులు పాల్గొన్నారు.

## శివోహం నృత్యరూపకం అమోఘం



శివోహం... అమోహం భక్తిరస నృత్యరూపకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, జూలై 16 ప్రభాతవార్త : తెలంగాణరాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, ప్రముఖ సాంస్కృతిక సంస్థ స్పందన ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శివోహం ... అమోఘం శీర్షికన మహాశివుని పలుపలు విధముల కీర్తించి పూజిస్తూ ప్రదర్శించిన శివోహం నృత్య రూపకం అమోఘంగా సాగింది. ఈమేరకు సంస్థ 35వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని పరమశివునుడుకి రెండువందల మందికిపైగా సంస్థ నృత్యకళాకారులు వివిధాంశాలతో జాతీయ కళామందిరం రవీంద్రభారతి ప్రధాన వేదికగా సంగీత నృత్యభరితంగా విచ్చేసిన అశేష ప్రేక్షకును ఆధ్యాత్మి కలోకంలో విహరింపజేశారు. ముఖ్యంగా చిన్నారుల బ్రహ్మమురారి శివార్చిత లింగం- లింగాష్టకం, శంభో శివశంభో స్వయంభో, నమోనమః శివాయ, ప్రభుం ప్రాణనాదం, ఆనందతాండవమాయో శివుడు, హరహర శంభో గౌరీశ, కాశీపురానాధాయ కాలభైరవాయ నమః తదితర భక్తిరస ప్రదర్శనలు తన్మయుల్ని చేశాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కె.వి.రమణారావు భారతీయ సంప్రదాయ నృత్యాలు దేశ సంస్కృతికి ప్రతిబింబాలని, దైవస్మరణకు సంగీత నృత్య సాహిత్యాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ విశిష్ట అతిథులు, లెజెండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పి.వెంకటేష్, న్యాయవాది చక్రపాణి, బిజెపి నాయకుడు నర్సింగ్‌రావు, నటుడు కోటేష్, సాహితీవేత్త సత్యం, సంస్థ వ్యవస్థాపకుడు శ్రీకాంత్‌గౌడ్, అధ్యక్షుడు రవికుమార్, నృత్యదర్శకుడు రామదాస్ తదితరులతో కలిసి ఈనాటి శివోహం... అమోఘంలో ప్రదర్శనలిచ్చిన కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.

## కట్టమైసమ్మ దేవాలయంలో కుమ్మర్ల బోనాల వేడుకలు

-హాజరైన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీ ఆర్.కృష్ణయ్య



కుమ్మర్లు బోనాల వేడుకలలో ప్రసంగిస్తున్న మంత్రి కొండా సురేఖ

ముషీరాబాద్, జులై 16, ప్రభాతవార్త: మట్టి కుండలతో బోనాలు సమర్పించటం శాస్త్రీయమైన సాంప్రదాయమని, అందరూ బోనాలకు మట్టి కుండలనే వినియోగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం ఆషాఢ మాస బోనాల సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కుమ్మర్ల తొలి బోనం వేడుకలకు ఆయన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మన ప్రభుత్వం సంప్రదాయ వృత్తులను పరిరక్షిస్తూ కళాకారులను ప్రోత్సహించే విధంగా అనేక చరయలు చేపడుతోందని తెలిపారు. సంప్రదాయ వృత్తులు నిలబడితేనే మన సంస్కృతి, వారసత్వం నిలుస్తాయని, కుమ్మరి వృత్తికి మరింత ప్రోత్సాహం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బోనాలు కేవలం ఒక పండుగ కాదని, ఇది తెలంగాణ ప్రజల ఐక్యతకు, భక్తికి, సంస్కృతికి ప్రతీక అన్నారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా అందరూ కలసి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచే మహోత్సవం బోనాల పండుగ అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రమంతా మంచి వర్షాలతో పాడి పంటలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఈర్లపల్లి శంకర్, కార్పోరేషన్ ఛైర్మన్‌లు మెట్టు సాయి కుమార్, మల్రెడ్డి రాంరెడ్డి, జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అద్యక్షులు జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, ఆమంచి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట ప్రకాశంనగర్‌లో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

-ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణలు,చెత్త లేకుండా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశం

-వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌ను తప్పని సరిగా ప్రదర్శించాలి



,ప్రకాశం నగర్‌లో క్షేత్ర స్థాయి తనిఖీ నిర్వహిస్తున్న ఏఎంసీ కమీషనర్ వినయ్‌కృష్ణారెడ్డి.

బేగంపేట జులై 16,ప్రభాతవార్త

బేగంపేట ప్రకాశం నగర్ లో మల్కాజ్ గిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయి లో పరిశీలన చేసారు.ఇటీవల బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ లో ఫుట్‌ఫాత్‌లపై ఉన్న డబ్బాలను తొలగించిన ప్రాంతంలో ఎలాంటి చెత్తా చెదారం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అలాగే హనుమాన్ ఆలయం పక్కనున్న బహుళ అంతస్తుల భవనానికి అనుమతులు ఎన్ని ఉన్నాయో పరిశీలించాలంటూ సిబ్బందికి సూచించారు.అనంతరం ప్రకాశం నగర్ ఎక్స్‌టెన్షన్ నాలా వద్ద పర్యటించి నాలాకు ఇరువైపులా ఉన్న చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు.ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణలు,చెత్త లేకుండా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశం.వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌ను తప్పని సరిగా ప్రదర్శించాలని సూచించారు.హోటళ్ల ఆహార వ్యర్ధాలను అధీకృత సంస్థకే అప్పగించాలి.అక్రమ సీఅండ్ డీ వ్యర్థాల డంపింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటామని,అలాంటి వాహనాల స్వాధీనం తప్పదని ఆయన హెచ్చరించారు.మౌలాలి అమ్ముగూడాలో సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గురువారం ఆయన అర్బన్ బయోడైవర్సిటీ,(యూబీడీ),రామ్‌కీ,ఈపీటీఆర్ఐ సిబ్బందితో కల్సి బేగంపేట ప్రాంతంలో పర్యటించారు.ప్రకాశం నగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి పారిశుధ్యం,పౌరమౌళిక వసతులు,నియంత్రణ చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఫుట్‌ఫాత్‌లపై చెత్త,ఆక్రమణలు,ఇతర అడ్డంకులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టి పాదచారులకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని ఆదేశించారు.తనిఖీ సందర్భంగా రహదారి పక్కన అక్రమంగా పారబోసిన నిర్మాణ,కూల్చివేత వ్యర్థాలు (సీఅండ్ డీ వేస్ట్) ను గుర్తించిన కమీషనర్ సంబంధిత ఆస్తి యజమానిని ప్రశ్నించగా వ్యర్థాల తొలగింపు బాధ్యతను బిల్డర్ కు అప్పగించినట్లు తెలియజేసారు.అనంతరం బిల్డర్ ను విచారించగా అధీకృత సంస్థకు బదులుగా అనధికార రవాణా వాహనాలను వినియోగించినట్లు వెల్లడైంది.దీనిపై స్పందించిన కమీషనర్ అక్రమంగా పారబోసిన సీఅండ్‌డి వ్యర్థాలను మౌలాలి అమ్ము గూడా ప్రాంతంలోని అనధికార డంపింగ్ స్థలంలో గుర్తించి సంబంధిత వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.అలాగే సంబంధిత డిప్యూటీ కమీషనర్ కు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా కొనసాగించాలని ,అక్రమ డంపింగ్ ను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు అమలు చేపట్టాలని ఆదేశించారు.నిర్మాణ,కూల్చివేత వ్యర్థాలను అక్రమంగా పారబోసే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు నిబంధనలు ఉల్లఘించిన వాహనాలను ఎలాంటి మినహాయింపు లేకుండా స్వాధీనం చేసుకుంటామని కమీషనర్ హెచ్చరించారు.పరిశుభ్రమైన,సురక్షితమైన బాధ్యతాయుతమైన నగర నిర్మాణానికి ప్రజలు,నిర్మాణ సంస్థలు,వ్యాపారులు,సంబంధిత శాఖలు సమిష్టిగా సహకరించాలని కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు.

## బంజారాహిల్స్‌లో నాలాలో పూడికతీత పనులు


బంజారాహిల్స్ లో వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది.

**జూబ్లీహిల్స్, జులై 16, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు వెంకటేశ్వ రకాలనీ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్ ఆధ్వర్యంలో గురువారం రోడ్ నంబరు 14లో నాలాలో పూడికతీత పనులు చేపట్టారు. గత కొద్ది రోజులుగా ఇక్కడున్న నాలా, డ్రైనేజీలు వ్యర్థాలతో నిండిపోయి మురుగు నీరు మొత్తం రోడ్డుపై పారుతుంది. స్థానికులు ఈ విషయాన్ని రాములు చౌహాన్ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. హైడ్రా అధికారులకు ఎమ్మెల్యే సమస్యను వివరించడంతో హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రోడ్ నంబరు 14లోని మాజీ కార్పొరేటర్ భారతీ నాయక్ ఇంటి ముందు నుంచి మొదలుకొని దాదాపు కిలో మీటరు మేర నాలా వెంట ఉన్న మొత్తం వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా రాములు చౌహాన్ మాట్లాడుతూ.. చాలా రోజులుగా ఈ దారిలో మురుగు రోడ్డు మీద పారుతుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే చొరవతో ఈ పనులు వెంటనే పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.

## శాంతి భద్రతల పరిరక్షణకై ప్రత్యేక చర్యలు

### గాంధీనగర్ నూతన సీఐ సీహెచ్ సురేష్‌బాబు



**ముషీరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నూతన సీఐ సీహెచ్ సురేష్‌బాబు స్పష్టం చేశారు. 2007 బ్యాచ్‌కి చెందిన సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, గంజాయిని రూపుమాపేందుకు కృషి చేస్తానని తెలిపారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంటుందని, పెట్రోలింగ్ ముమ్మరం చేయటంతో పాటు మహిళల రక్షణపై దృష్టి పెడతామని అన్నారు.

## ఏఐసిసి ఎపి ఇన్‌చార్జిగా డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి


డాక్టర్ రవి శేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న బీసీ చైతన్య వేదిక గ్రేటర్ నేతలు

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, కెకెసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జిగా ఏఐసిసి జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఏఐసిసి కేకేసీ నేషనల్ ఛైర్మన్ డాక్టర్ ఉదిత్‌రాజ్, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కే.సి.వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశేఖర్‌రెడ్డిని ఎర్రగడ్డ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కాలనీలోని పావని ప్లాజాలో ఏఐసీసీ కెకెసీ ప్రతినిధి లక్ష్మణ్‌గౌడ్ మరియు బి.సి.జన చైతన్య గ్రేటర్ అధ్యక్షులు టి.వినోద్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు నూతన బాధ్యతలు అప్పగించినందుకు ఉదిత్‌రాజ్‌కు ధన్యవాదములు తెలిపారు. పార్టీ ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ, పార్టీ బలోపేతానికి పీసీసీ అధ్యక్షులు వై.ఎస్.షర్మిలతో కలసి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి.సి.జన చైతన్య గ్రేటర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ గౌడ్


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

**కుత్బుల్లాపూర్, జులై 16, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గురువారం కలిసిన ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్‌కు శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తోందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

## బాపునగర్‌లో కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, జులై 16, ప్రభాతవార్త:**
బాపునగర్‌లో కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని బాపునగర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి సింగ్ జాధవ్, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 విజిలెన్స్ కమిటీ సభ్యుడు కునాల్ రాథోడ్ అధికారులను కోరారు. సికింద్రాబాద్‌లోని చీఫ్ రేషనింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సరఫరా అధికారి శ్రీనివాస్, సర్కిల్-7 సహాయ సరఫరా అధికారి జ్యోతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం బాపునగర్ ప్రజలు ప్రతి నెల రేషన్ కోసం దూరంలోని దుకాణానికి వెళ్లాల్సి వస్తోందని, దీంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రజల సౌకర్యార్థం బాపునగర్ లోనే కొత్త రేషన్ దుకాణాన్ని మంజూరు చేయాలని కోరారు. వినతిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు హరి సింగ్ జాధవ్, కునాల్ రాథోడ్ తెలిపారు.

# భక్తజనసందోహం మధ్య జగన్నాథుని రథయాత్ర


జగన్నాథుని ఆలయం వద్ద భక్తజనం, సమీక్షిస్తున్న పోలీసు అధికారులు


రథయాత్రలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు


పాతబస్తీ అలియాబాద్ శక్కర్‌గంజ్‌లోని అతిపురాతనమైన శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో వైభవంగా సాగుతున్న రథయాత్ర


సంగీత్ చౌరస్తాలోని ఇస్కాన్ టెంపుల్ వద్ద జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్,గజ్జెల నాగేశ్ తదితరులు

**జూబ్లీహిల్స్, జులై 16, ప్రభాతవార్త:** భక్తజన సందోహం మధ్య జగన్నాథ రథయాత్ర కన్నుల పండుగగా సాగింది. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే రథయాత్రను బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని శ్రీ జగన్నాథ ఆలయంలో గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వమించారు. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ప్రతిష్ఠించి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించారు. శ్రీక్షేత్రం నుంచి గుండిచా ఆలయం వరకు ఈ రథయాత్రను కొనసాగించారు. ఉత్సవ విగ్రహాలను అక్కడే పెట్టి తొమ్మిది రోజులపాటు పూజలు చేసిన అనంతరం తిరుగుయాత్ర పేరుతో వేడుకను ఈ నెల 24న నిర్వహిస్తారు. రథయాత్ర నేపథ్యంలో ఉదయం నుంచే ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎసిపి కట్టా హరిప్రసాద్, ఎస్హెచ్ఓ గోవర్ధన్‌రెడ్డిలతోపాటు బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సుహాసన్, డిఐ కవియుద్దీన్‌ల ఆధ్వర్యంలో ఇక్కడ బందోబస్తు చర్యలు చేపట్టారు.

**అల్వాల్‌లో**
**అల్వాల్, జులై 16 ప్రభాతవార్త:** అల్వాల్‌లో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. రథయాత్రలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. బలభద్రుల రథాన్ని ఎమ్మెల్యే దంపతులు స్వయంగా లాగడం జరిగింది. అంతకు ముందు స్థానిక మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పట్టణ ప్రథమ పౌరుడికి స్వామి వారి ప్రత్యేక తీర్థ ప్రసాదాలు అందించారు. రథయాత్ర అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

**సంగీత్ చౌరస్తాలో..**
**కంటోన్మెంట్, జులై 16 ప్రభాతవార్త:** భక్తుల చెంతకే భగవంతుడు వచ్చే గొప్పపండుగ జగన్నాధ రథయాత్ర అని మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం పూరీలో జరిగే జగన్నాధ రథయాత్రను పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి రథయాత్రలో ఆయన పాల్గొని రథానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, ఇస్కాన్ కమిటీ ప్రతినిధులు రమేష్,సురేశ్, బిఆర్ఎస్ నాయకులు తలసాని మహేష్ యాదవ్,కొండాపురం మహేష్ యాదవ్,రాపోలు మాధురి తదితరులు పాల్గొన్నారు.


కాటేదాన్ పరిధిలోని టిఎన్‌జిఓఎస్ కాలనీలో కన్నుల పండువగా జరిగిన జగన్నాథ స్వామి వారి రథయాత్ర మహోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అతిథిగా పాల్గొని స్వామివారి రథాన్ని లాగి యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు : చీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్


పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న సిఈ పాండ్యా నాయక్

**హైదరాబాద్, జులై 16, ప్రభాతవార్త:**
వినియోగదారులకు మరింత నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్యా నాయక్ అన్నారు. ఈమేరకు గురువారం రాజేంద్రనగర్ డివిజన్‌లోని 33/11 కేవీ ప్రొవిడెంట్ సబ్‌స్టేషన్‌లో ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సేవల్లోకి తీసుకువచ్చారు. అలాగే జేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ ప్రొవిడెంట్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ వసూళ్లు, బకాయి బిల్లుల వసూళ్లు, కాలిపోయిన విద్యుత్ మీటర్ల సకాలంలో మార్పిడి, డిలిస్ట్ ఆపరేషన్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో ప్రొవిడెంట్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 8 ఎంవీఏకు పెంచే పనులను విజయవంతంగా పూర్తి చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన అన్ని సాంకేతిక పరీక్షలను విజయవంతంగా నిర్వహించగా, వాటి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఈసందర్భంగా పాండ్యానాయక్ మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు వోల్టేజ్ సమస్యలు తగ్గి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రామ్మోహన్, డివిజనల్ ఇంజనీర్లు టి. భాస్కర్ రావు, చంద్రశేఖర్ (ప్రొటెక్షన్, లైన్స్, కన్‌స్ట్రక్షన్), అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ చరిత్రలో సరికొత్త రికార్డు.. మూడు విభాగాల్లో సాన్వి లట్టాల విజయం


జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2026లో సాన్వి లట్టాల బహుమతులు గెలుచుకున్న దృశ్యం

**చిక్కడపల్లి జులై 16 ( ప్రభాతవార్త )** బ్యాడ్మింటన్ చరిత్రలో 11 ఏళ్ల బాలిక అరుదైన మైలురాయిని అధిగమించింది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2026లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన సాన్వి లట్టాల అపూర్వమైన రీతిలో చరిత్ర సృష్టించింది. తన అద్భుతమైన ఆటతీరుతో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ ఏకంగా మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. సాన్వి అండర్13, అండర్15, అండర్17 బాలికల సింగిల్స్ విభాగాల్లో వరుసగా విజేతగా నిలిచింది. టోర్నీ లో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఒక్క సెట్ కూడా కోల్పోకుండా విజయ కేతనం ఎగురవేయడం విశేషం. ఒకే జిల్లా ఛాంపియన్‌షిప్‌లో మూడు వేర్వేరు విభాగాల్లో విజేతగా నిలిచిన మొట్టమొదటి బాలికగా సాన్వి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విజయంతో త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీకాకుళం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అర్హతను ఆమె సాధించింది. టోర్నమెంట్ ముగింపు సభకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సాగర్, చైర్మన్ రాజేంద్రన్, సీఈఓ సూరిబాబు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం 11 ఏళ్ల వయసులోనే సాన్వి సాధించిన అరుదైన విజయాన్ని అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ ఇదే విజయపరంపరను కొనసాగించి జిల్లా కీర్తిని చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంతో మంది యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ గ్రూప్ వ్యవస్థాపకులు వేణు ముప్పాల అన్నారు.

## బిసిల చేతి వృత్తులను ప్రోత్సహించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్


గాజుల బుట్టను ఎత్తుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జులై 16,ప్రభాతవార్త:**
బి.సి. కుల వృత్తులను ఎక్కువగా ప్రోత్సహించాలని రాష్ట్ర రవాణా, బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆషాఢ బోనాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో "బోనాలు చేతివృత్తుల మేళా2026"ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ ఠాగూర్, ఈర్ల పల్లి శంకర్, కార్పొరేషన్ల ఛైర్మన్లు, సెక్రెటరీ బాలమాయ దేవితో కలసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులవృత్తులను ప్రోత్సహించడం, బీసీ వర్గాలకు చెందిన కళాకారులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 16 నుంచి 26 వరకు పది రోజులపాటు నిర్వహిస్తున్న ఈ మేళాలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీసీ చేతివృత్తుల కళాకారులకు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ కులవృత్తులు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడమే కాకుండా పర్యావరణహితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని కూడా ప్రోత్సహిస్తాయని అన్నారు. సంప్రదాయ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు భావితరాలకు కులవృత్తుల ప్రాధాన్యతను తెలియజేస్తూ కుల వృత్తుల కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో టెర్రకోట ఉత్పత్తులు, మట్టి పాత్రలు, జనపనార ఉత్పత్తులు, గద్వాల్ చీరలు, పోచంపల్లి ఇకత్ చేనేత చీరలను అందుబాటులో ఉంచారు.

# నందనవనంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

**-పలువురికి గాయాలు..**
**కౌంటర్ కేసులు నమోదు చేసిన పోలీసులు**

**సరూర్‌నగర్, జులై 16 ప్రభాతవార్త:** పార్కు చేసి ఉన్న కారు అద్దం పగిలిన ఘటన కాస్తా రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసి పరస్పర దాడులకు కారణమైంది. ఓ వర్గం కర్రలు, రాళ్ళతో దాడులు చేయగా పలువురికి గాయాలు అవ్వగా ద్విచక్ర వాహనాలు పాక్షికంగా ధ్వంసం అయ్యాయి. దాడిలో ఓ వ్యక్తిపై వేడిగా ఉన్న పానకం పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మొత్తం మీద స్వల్ప వివాదం కాస్తా దాడుల వరకు వెళ్ళి భయానక ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల వారు పరస్పర ఫిర్యాదులు చేయడంతో పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు. ఈ ఘటన హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పిఎస్ ఏరియాలో బుధవారం రాత్రి జరిగింది. ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కర్మన్‌ఘాట్ సమీపంలోని నందనవనం కాలనీలో ఓ వీధిలో బీహార్‌కు చెందిన కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. సదరు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలురు గొడవ పడుతూ కాలనీలో పార్కు చేసిన మధు అనే వ్యక్తికి చెందిన కారుపై పడడంతో అద్దం పగిలింది. దీంతో కోపగించుకున్న మధు భార్య నిలదీయడంతో సదరు బాలురు కారు అద్దం కోసం డబ్బులు ఇస్తామని అన్నారు. అయితే కారు అద్దం పగిలిన విషయం తెలుసుకున్న మధు తమ సంబంధీకులకు తెలపడంతో దాదాపు నలభై మంది వరకు బీహారీలు నివసిస్తున్న వీధిలోకి వచ్చి దాడులు చేశారు. ఈ మేరకు కర్రలు, రాళ్ళతో అక్కడ పార్కు చేసి ఉన్న వాహనాలపై విరుచుకుపడ్డారు. దీంతో బీహారీలు ప్రతి దాడులకు సిద్ధం కాగా ఇరు వర్గాల మధ్య బాహాబాహి జరిగింది. ఇంతలో ఓ వ్యక్తి వేడిగా ఉన్న పానకాన్ని మధు స్నేహితుడు యశ్వంత్‌పై పోయడంతో అతని మొహంపై కాలిన గాయాలయ్యాయి. మధు సంబంధీకులు కర్రలతో దాడులు చేయగా బీహార్‌కు చెందిన కరణ్, గోవింద్ తదితరుల తలలకు గాయాలు అయ్యాయి. ఇరు వర్గాల వారు పరస్పరం దాడులు చేసుకుంటున్న దృశ్యాలతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గాయపడ్డ వారిని సహచరులు చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు. నందనవనంలో దాడుల ఉదంతం సమాచారం అందగా పోలీసులు ఘటనా ప్రాంతానికి వచ్చి సమీక్ష జరిపారు. ఈ మేరకు ఇరు వర్గాల వారు ఫిర్యాదు చేయడంతో కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జగదాంబ అమ్మ వారికి బంగారు బోనం సమర్పణ


కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జులై 16 ప్రభాతవార్త :**
ఆషాడ మాసం పాతనగర బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా గురువారంసప్త మాత్రికులకు సప్త బోనాలలో భాగంగా భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షుడు మల్యాల మధుసూధన్ యాదవ్ ఆధ్వర్యంలో గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మ వారికి తొలి బంగారుబోనం సమర్పించారు. పాతబస్తీ హరిబౌలి శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కళాకారుల నృత్యాల నడుమ భాజా భజంత్రీలతో జోగిని అవికాదేవి మరియు పోత రాజుల నృత్యాలతో బయలు దేరి వెళ్లి గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మ వారికి తొలి బంగారు బోనం,పట్టు వస్త్రాలు,ఒడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మధుసూదన్ యాదవ్,విష్ణుగౌడ్,గాజుల అంజయ్య,పొటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్,ఎ.కైలాష్,బుల్లెట్ శ్రీ ధర్,హంసరాజ్,ప్రవీణ్ కుమార్ గౌడ్, దినేష్,శశాంక్ తివారీ,రామగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

**అత్తాపూర్ జులై16,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ ,అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో మట్కా,పేకాట అడుతున్న ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.17,740 నగదు, 5 మొబైల్ ఫోన్లు మరియు 2 సెట్ల పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. సిఐ సీతయ్య వివరాల ప్రకారం...అత్తాపూర్ పరిధిలోని పాండురంగనగర్, హనుమాన్ దేవాలయం వెనుకనున్న బహిరంగ ప్రదేశంలో పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ జోన్ టాస్క్‌ఫోర్స్ మరియు అత్తాపూర్ పోలీసులు సంయుక్త గా దాడులు నిర్వహించి ఏడుగురు నిందితులు నరేష్ నాయక్ (30),సునీల్ (29) వెంకటేష్ రాథోడ్ (35), రాజు (26)గోపాల్ (50), రామ్‌జీ (42) ఎ. ప్రవీణ్ రెడ్డి (30)లను అదుపులోకి తీసకొని వారి వద్ద నుండి రూ.17,740/ నగదు ,5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మానవతం చాటుకున్న అధికారులు



**కెపిహెచ్‌బి కాలనీ, జులై 16, ప్రభాతవార్త :**
కదలలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని కూకట్‌పల్లి సర్కిల్ అధికారులు మానవతా దృక్పథంతో ఫౌండేషన్‌కు తరలించి తమ బాధ్యతను చాటుకున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో కల్వరి టెంపుల్ దగ్గర హనుమంతు అనే వృద్ధుడు (75) గత కొన్ని రోజులుగా రోడ్డు పక్కన ఫుట్‌పాత్ వద్ద శరీరంపైన సరైన బట్టలు లేక కదలలేని స్థితిలో అక్కడే మల మూత్రాలు చేసుకుంటూ అత్యంత దుర్భరమైన స్థితిలో జీవనం కొనసాగిస్తున్నాడు. వృద్ధుడి బాధలు చూడలేక స్థానికులు ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్ రెడ్డికి సమాచారం అందించారు. దీంతో సురేష్ రెడ్డి సూచనతో కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి ఆర్ కె పావన్న గౌడ్ కదలలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని సపర్యలు చేసి శివానంద ఆశ్రమంలో గల అమర ఫౌండేషన్‌కు తరలించారు. ఫౌండేషన్ నిర్వాహకులు వృద్ధుడికి క్లీన్‌గా క్షవరం గడ్డం తీసేసి స్నానాలు చేయించి శుభ్రంగా గదిలో వసతి కల్పించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పాన్‌షాప్ నిర్వాహకుడిపై వ్యక్తి దాడి

**ముషీరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** తన వద్ద తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని కోరినందుకు పాన్‌షాప్ నిర్వాహకుడిపై ఒక వ్యక్తి దాడి చేసిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ సిటీకి చెందిన షోయబ్ (29) గత కొన్ని సంవత్సరాలుగా దోమలగూడలోని గగన్‌మహల్ వద్ద పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. పక్కనే ఉన్న చాయ్ దుకాణంలో పని చేసే అబ్దుల్లా (23) అనే వ్యక్తి షోయబ్ వద్ద ఐదు వేల రూపాయలు అప్పు తీసుకున్నాడు. బుధవారం తన డబ్బులు తిరిగి ఇవ్వాలని షోయబ్, అబ్దుల్లాను అడగటంతో ఆగ్రహించిన అబ్దుల్లా, షోయబ్‌పై దాడి చేసి, పాన్‌షాప్‌లో ఉన్న పదివేల రూపాయల నగదును తీసుకుని పారిపోయాడు. షోయబ్ దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అల్వాల్ క్రైమ్ పోలీసులకు సిపి రివార్డులు

**అల్వాల్, జులై 16 ప్రభాతవార్త:** హనీ ట్రాప్, దోపిడీ, బెదిరింపులకు సంబంధించిన అంతర్రాష్ట్ర కేసులో అత్యున్నతమైన పని తీరును కనపరిచిన అల్వాల్ పోలీసు స్టేషన్ క్రైమ్ సిబ్బందికి మల్కాజిగిరి కమీషనర్ సుమతి రివార్డులు అందించారు. గత ఏడాది అల్వాల్‌లోని ఐస్ ఫ్యాక్టరీ రోడ్డు వద్ద ఓ వ్యాపారవేత్తను పోలీసు పేరుతో కిడ్నాప్ చేసి అతని నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లను ఐదుగురు బృందంగా ఉన్న నిందితులు అపహరించారు. అనంతరం బాధితుడిని ఒరిస్సా ఆంధ్రా సరిహద్దులు బర్హంపూర్ అటవీ ప్రాంతంలో వదిలేశారు. దోపిడీ అనంతరం నిందితులు నగరంలో కొందరు హర్యానాకు కొంత మంది పరారయ్యారు. కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న అల్వాల్‌లో పోలీసులు డిఐ వీరబాబు, ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ జీవన్ కుమార్, పిసిలు రామాకాంత్, గౌస్ పాషాలు రంగంలోకి దిగారు. దోపిడికి నేతృత్వం వహించిన ఇద్దరిని నగరంలోనే పట్టుకున్నారు. మిగిలిన బృంద సభ్యులు హర్యానాలోని కురుక్షేత్రలో తలదాచుకున్నట్లు గుర్తించిన వీరు అక్కడి పోలీసులు సహకారంతో ఆపరేషన్‌ను నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి నగరానికి తీసుకుని వచ్చి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సిబ్బంది పనితీరుకు నిదర్శనంగా సిపి రివార్డులు అందించడంతో పాటుగా ప్రశంసించడం జరిగింది.

## స్కూల్‌కు వెళ్తున్న బాలికపై అత్యాచారం.. నిందితుడు అరెస్ట్

**సంజీవరెడ్డి నగర్, జులై 16, ప్రభాతవార్త:** సనత్‌నగర్‌లో 9వ తరగతి చదువుతున్న ఓ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపింది. స్కూల్‌కు వెళ్తున్న బాలికను షాబాద్ (27) అనే వ్యక్తి తన ఇంటికి తీసుకెళ్లి బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని సినీ నటి కరాటే కళ్యాణి సహా పలువురు డిమాండ్ చేశారు. పోలీసులు కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

## సీఎం పర్యటన సమాచారం లీక్..తెలుగు స్క్రైబ్‌పై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జులై 16, ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన అత్యంత గోప్యమైన భద్రతా సమాచారాన్ని సోషల్ మీడియాలో లీక్ చేసిన ఘటనపై ఖైరతాబాద్ పోలీసులు తెలుగు స్క్రైబ్ సామాజిక ఖాతాపై కేసు నమోదు చేశారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ)లో సీఎంకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.బి. ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. 13న ముఖ్యమంత్రి ఢిల్లీ అధికారిక పర్యటన నేపథ్యంలో ఆయన కార్యక్రమ వివరాలు, జడ్ ప్లస్ భద్రతా వర్గీకరణ, బందోబస్తు సూచనలు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అధికారిక మొబైల్ నంబర్, అత్యవసర వైద్య అవసరాల కోసం ముఖ్యమంత్రి రక్త గ్రూపు తదితర వివరాలతో కూడిన గోప్య వైర్‌లెస్ సందేశాన్ని సంబంధిత ప్రభుత్వ, భద్రతా విభాగాలకు పంపించారు. అయితే, ముఖ్యమంత్రి పర్యటన కొనసాగుతున్న సమయంలోనే "తెలుగు స్క్రైబ్" పేరిట ఉన్న ఎక్స్(ట్విటర్) ఖాతాలో ఆ గోప్య వైర్‌లెస్ సందేశం ఫోటోను అనధికారికంగా పోస్టు చేశారు. దీంతో ముఖ్యమంత్రి ప్రయాణ షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లు, ఇతర సున్నితమైన సమాచారం బహిర్గతమై భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమయ్యాయి. గోప్యంగా ఉంచాల్సిన పత్రాలు బయటకు లీక్ చేసిన వ్యక్తులు, సంబంధిత సోషల్ మీడియా ఖాతా నిర్వాహకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఖైరతాబాద్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 303(2), 317(2), 316(2), 125తో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 43(బి), 66 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెచ్‌డీబీ ఫైనాన్స్ సంస్థకు రూ.17.98 లక్షల మోసం

**జూబ్లీహిల్స్, జులై 16, ప్రభాతవార్త:**
తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించకుండా, ఫైనాన్స్ సంస్థకు హైపోథికేషన్‌లో ఉన్న వాహనాన్ని అక్రమంగా విక్రయించిన ముగ్గురిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మెచ్ డ్రిల్ ఎక్విప్‌మెంట్స్ సంస్థకు చెందిన జంగం సుధీర్ రెడ్డి, 2019 సెప్టెంబర్ 30న క్రేన్ కొనుగోలుకు రూ.25 లక్షల రుణం తీసుకున్నారు. రుణ ఒప్పందం ప్రకారం 51 నెలల పాటు నెలకు రూ.68,800 చొప్పున ఈఎంఐలు చెల్లించాల్సి ఉండగా, 33 ఈఎంఐలు చెల్లించిన తర్వాత చెల్లింపులు నిలిపివేశారు. అనంతరం రుణానికి భద్రతగా ఉన్న క్రేన్‌ను సంస్థ అనుమతి లేకుండా విక్రయించినట్లు లేదా దాచిపెట్టినట్లు ఫైనాన్స్ సంస్థ అనుమానించింది. బకాయిల వసూళ్ల కోసం సంస్థ ప్రతినిధులు పలుమార్లు నిందితుల నివాసానికి వెళ్లినా స్పందించలేదు. సంస్థకు దాదాపు రూ.17,98,798 నష్టం వాటిల్లడంతో కోర్టును ఆశ్రయించారు. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థకు చెందిన లీగల్ అసోసియేట్ ఎ. అశ్విని కుమార్ ఫిర్యాదుతో కోర్టు ఆదేశాల మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీవీ ప్రత్యక్ష చర్చలో రచయితపై చెప్పుతో దాడి.

**- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు**

**జూబ్లీహిల్స్, జులై 16, ప్రభాతవార్త:**
ఒక టీవీ స్టూడియోలో నిర్వహించిన ప్రత్యక్ష చర్చా కార్యక్రమంలో రచయితపై చెప్పుతో దాడి చేసిన సంఘటనపై నమోదైన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్‌బీనగర్‌లోని చంద్రపురి కాలనీకి చెందిన రచయిత విజయవిహారం రామనమూర్తి(61) 15న బీఆర్‌కే న్యూస్ టీవీ స్టూడియోలో నిర్వహించిన లైవ్ డిబేట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదే కార్యక్రమంలో పాల్గొన్న కాశ్యప్ రెడ్డి ఆయనతో వాగ్వాదానికి దిగాడు. కాశ్యప్ రెడ్డి అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, చంపేస్తానంటూ బెదిరించి, చెప్పుతో ముఖం, మెడ భాగాలపై పలుమార్లు దాడి చేశాడని విజయవిహారం రామనమూర్తి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ పలు లైవ్ డిబేట్ల సందర్భంగా తనను ప్రాణహాని బెదిరింపులకు గురిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కంప్రెసివ్ మైలోపతి వ్యాధికి చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఈ దాడితో మెడ నొప్పి తీవ్రతరమైందని రామనమూర్తి తెలిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు సెక్షన్లు 115(2), 133, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమాజానికి తమ వంతు సేవలు : ఫెడ్ చైర్మన్ గంగారాం



కింగ్ కోటి ఆసుపత్రికి వీల్ చైర్స్‌ను అందజేస్తున్న ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ద డిసెబుల్డ్ చైర్మన్ గంగారాం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం తదితరులు

**మలక్ పేట, జులై 16, ప్రభాతవార్త:** సమాజానికి తమ వంతు సేవలను అందిస్తున్నామని ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ద డిసెబుల్డ్(ఫెడ్) చైర్మన్ గంగారాం పేర్కొన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ద డిసెబుల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కింగ్ కోటి హాస్పిటల్ సూపరిండెంట్ సంతోష్ కుమార్, ఆర్ఎంఓ చెతుల మీదుగా వీల్ చైర్లను విరాళంగా ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే వృద్ధులు, వికలాంగులు, ప్రసూతి మహిళలకు ఉపయోగించుకోవడానికి ఆసరాగా ఈ వీల్ చైర్ లను ఆసుపత్రికి అందజేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, అమ్మ జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షులు వీరబోయిన భద్రయ్య యాదవ్,లాల్ సింగ్ పాల్గొన్నారు.

## ధైర్యంగా ముందడుగు వేయండి.. భవిష్యత్ మీదే : వ్యోమగామి శుభాన్షు శుక్లా



వ్యోమగామి శుభాన్షు శుక్లా కు జ్ఞాపికను అందజేస్తున్న మల్కా యశస్వి

**నాచారం, జులై 16 ప్రభాతవార్త :** విద్యార్థులు పెద్ద కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో కష్టపడాలని భారత ప్రముఖ వ్యోమగామి శుభాన్షు శుక్లా పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యటనలో భాగంగా నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన విశ్వ సంభాషణ కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి అంతరిక్ష ప్రయాణ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటిన శుక్లాకు విద్యార్థులు అంతరిక్ష వేషధారణలో స్వాగతం పలకడం ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ, "భయాలను విడిచిపెట్టి ధైర్యంగా ముందుకు సాగండి. లక్ష్యంపై దృష్టి పెడితే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు"అని సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్ ఎమ్మెల్సీ,ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్,పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య,ముఖ్య కార్యనిర్వాహణ అధికారి మల్కా యశస్వి మాట్లాడుతూ శుభాన్షు శుక్లా భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు.కార్యక్రమంలో శుక్లా రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించగా,ఆయన అంతరిక్ష ప్రయాణంపై రూపొందించిన దృశ్యావళిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

## సర్‌పై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జులై 16 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలోని వివిధ బూతులలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి బిఎల్ఓల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, ఇంచార్జీ సుభాష్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ పాల్గొని బిఎల్ఎలతో మాట్లాడి కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావాలని, ప్రతిఇంటికి వెళ్ళాలని, ఎవరూ ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే బిఎల్ఎలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు బిఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సర్ ప్రక్రియ చేపట్టాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వెంకట్‌రెడ్డినగర్‌లో ఓటరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, యువ నేత లవంగు నవీన్ తదితరులు

**రామంతాపూర్, జులై 16 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, అధికారులకు తగు సహకారం అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్ సాయిరాం స్కూల్ వద్ద బిఆర్ఎస్ యువ నేత లవంగు నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సహాయక కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, పేరు తొలగింపు తదితర దరఖాస్తుల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని, సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ నేత లవంగు నవీన్ మాట్లాడుతూ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లో సర్ విజయవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలు భారీగా వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, డా.బి.వి.చారి, జహంగీర్, హరీష్, దినేష్, యాకాంతరావు, అబ్బు, కాసీం, మధు, శ్రీనివాస్, బాలకృష్ణ, అద్విత్, అనిల్, రవీందర్, అక్బర్, శంకర్, హరీష్, మహిళా నేతలు యాదమ్మ, రాజ్యలక్ష్మి, బూప్య రేఖ, నిర్మల, ఐశ్వర్య, రాధమ్మ, రాధిక, లతారెడ్డి, నవనీత, మంజుల పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బ్యాంకు కాలనీలో 22 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు కాలనీ అసోసియేషన్ సభ్యులు తులసీదాస్, ఈశ్వర్, వాసుదేవరావు, యాదగిరి మూర్తి, భార్గవి, సూర్య, సురేష్, బాబు ప్రవీణ్ సిద్ధూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు కిషోర్ తదితరులు పాల్గొన్నారు

## జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ

**- అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమంపై వినతి**



**మల్కాజ్‌గిరి, జులై 16 ,ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డులో మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జలమండలిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రస్తుతం ఒకే విధమైన పనులు, ఒకే బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ వేర్వేరు కేటగిరీల పేర్లతో అసమాన వేతనాలు చెల్లిస్తున్నారని, స్కిల్డ్, అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు న్యాయమైన వేతనాలు అందేలా చూడాలని అలాగే విధులు నిర్వహిస్తూ మరణించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా మానవతా దృక్పథంతో వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు.మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని కౌకూర్ రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వాటర్ ట్రయల్ రన్ నిర్వహించి, ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మచ్చ బొల్లారం పరిధిలోని ఏడు కాలనీల భూగర్భ డ్రైనేజీ ట్రంక్ మెయిన్ నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించేందుకు కృషి చేసిన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.వర్షాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో బోర్‌వెల్‌లకు మరమ్మతులు చేపట్టాలని, అలాగే మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు మరియు విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆశలను ఆవిరి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం : అరవింద్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జులై 16 ప్రభాతవార్త:** ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలోకి కాంగ్రెస్ ప్రభుత్వం యువత ఆశలను ఆవిరి చేస్తోందని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద ఈనెల 18వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహించే యువ మహాసంగ్రామ సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పిలుపుమేరకు నిర్వహించే కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, వేలాది మందితో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యువత పెద్దఎత్తున కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పేరిట యువతకు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత నోటిఫికేషన్లు వెయ్యకపోగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను చస్తే చావు అని అంటున్నారన్నారు. మొదటి ఏడాదిలోనే 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తానని హామీ ఇచ్చి 10వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వంలో దాదాపు 20వేల వరకు పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అధికారులు చెప్తుంటే రేవంత్ రెడ్డి మాత్రం 5000 ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నాడని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వదిలి యువతకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువత, నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, మహమ్మద్ జాహీద్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఓర్పు సహనం సమానత్వం ఉంటేనే రాజకీయ భవిష్యత్: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**మన్సూరాబాద్, జులై 16, ప్రభాతవార్త:** ఓర్పు, సహనం, అన్ని వర్గాల వారిని కలుపుకొని పోతేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని లేకపోతే రాజకీయ భూస్థాపితం తప్పదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. వై టీ డి ఏ డైరెక్టర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను గురువారం ఆమె నివాసంలో శ్రీనివాస్ గౌడ్ కలిసి సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగం లో కూడా బీసీ లపై అగ్రకుల నాయకుల ఆగడాలు శృతిమించడం హేయమైన చర్య అని అన్నారు. బీసీ ల మంత ఏకమైతే నోటి దురుసుతో వీర్రవీగే నాయకులకు రాజకీయ భవిష్యత్ ఉండకుండా చేస్తామన్నారు. ఒక యువజన నాయకుడిగా ఉండి ఇదేనా యువకులకు ఇచ్చే సందేశం అని ప్రశ్నించారు. ప్రజా జీవితం లో ఉండాలంటే నోరు అదుపులో ఉండాలని, అన్ని వర్గాలతో మమేకమైతేనే గెలుపు సాధిస్తామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

ఇకనైనా వెంటనే ఈశ్వరమ్మ కు క్షమాపణలు తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ యాదవ్ కు పలు రాజకీయ , బీసీ సంఘాల నాయకులు మద్దతుగా ఆమెను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్సీ ఎగ్గే మల్లేశం కురుమ, చిన్న శ్రీశైలం యాదవ్, డాక్టర్ చిరంజీవులు, పల్లె రవికుమార్, రఘునాథ్ యాదవ్, సరిత, వేములయ్య గౌడ్ పాల్గొన్నారు.

## ద్వారకామాయి పీఠం గురుపౌర్ణమికి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

**సరూర్‌నగర్, జులై 16 ప్రభాతవార్త:** నీతివంతమైన బోధనల ద్వారా సమాజంలో మంచి మార్పును పెంపొందించడానికి అవిరళ కృషి చేస్తున్న హైదరాబాద్ మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో ఈ నెల 29వ తేదీన అత్యంత వైభవంగా జరిగే శ్రీ గురు పౌర్ణమి మహోత్సవం, ఆధ్యాత్మిక గ్రంథావిష్కరణ వేడుకలకు హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర ఐటి, శాసన సభా వ్యవహార శాఖామాత్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆహ్వానించారు. ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త అయిన స్వామీజీ గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంతి చీఫ్ సెక్రటరీ జానకి ఆర్ కొండపితో జూబ్లిహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబును సన్మానించి వేద ఆశీర్వచనం చేసి గతంలో తాను రచించిన పలు ఆధ్యాత్మిక గ్రంథాలను అందజేశారు. అనంతరం ఈ నెల 29వ తేదీన పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా బాబా పీఠంలో జరిగే గ్రంథావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ మంత్రిని ఆహ్వానించారు. అదే విధంగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారిని సైతం పీఠాధిపతి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీఠానికి చెందిన మల్లాది లలిత్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానించి ఆహ్వానిస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ: చిత్రంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ జానకి

## ఈశ్వరమ్మ యాదవ్‌కు యాదవ మహాసభ నేతల సన్మానం



యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్త ఈశ్వరమ్మ యాదవ్‌ను సన్మానించి సంఘీభావం తెలిపిన యాదవ మహాసభ నాయకులు

**సరూర్‌నగర్, జులై 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానానికి ధర్మకర్తగా రాష్ట్ర ప్రభుత్వంచే నియమితులైన ఎల్‌బినగర్ నియోజకవర్గ రాజకీయ కురువృద్ధురాలు, సీనియర్ నాయకురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడకు చెందిన అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. గురువారం ఆయన మహాసభకు చెందిన పలువురు నాయకులు, యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎల్‌బినగర్ చింతల్ కుంటలో ఈశ్వరమ్మ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఈశ్వరమ్మ యాదవ్‌పై ఇటీవల కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా యాదవ మహాసభ తరపున ఈశ్వరమ్మ యాదవ్‌కు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యాదవ మహాసభ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్, మాజీ మ ఎంపి ఎనుగుల అనిత్ అనిల్ యాదవ్, యాదవ నాయకులు జె.లక్ష్మయ్య యాదవ్, పోచబోయిన కృష్ణ యాదవ్, సురేష్ యాదవ్, జెనిగె జంగయ్య యాదవ్, దేవనమోని శ్రీనివాస్ యాదవ్, అబ్బనమోని గోపియాదవ్, వట్టి శ్రీశైలం యాదవ్, ఎనుగుల శివ యాదవ్, తుమ్మల శివ యాదవ్ పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం



వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్ రెవ.బ్రదర్ జాన్ కల్లరక్కల్, ప్రిన్సిపల్ జయంతిరెడ్డి, ప్రశాంత్ తదితరులు

**ఉప్పల్, జులై 16 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడానికి మరియు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం విద్యార్థులు తమ వంతు కృషి చేసేలా ప్రోత్సహించడానికి వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక బృందం, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు హాజరయ్యారు. వన మహోత్సవం యొక్క ప్రాముఖ్యతపై పరిచయంతో కార్యక్రమం ప్రారంభమైంది. పర్యావరణ సుస్థిరత పట్ల నిబద్ధతగా చెట్లను నాటి, వాటిని పెంచాలని ప్రిన్సిపల్ డాక్టర్ పి. జయంతి రెడ్డి కోరారు. ప్రకృతిని పరిరక్షించడంలో సామూహిక బాధ్యతను డైరెక్టర్ రెవ. బ్రదర్ జాన్ కల్లరక్కల్ నొక్కి చెప్పారు. ఈ వేడుకలో భాగంగా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు క్యాంపస్ అంతటా ఔషధ, అలంకార, ఫలవృక్ష మరియు నీడనిచ్చే మొక్కలను నాటారు. కళాశాల ప్రాంగణం దాటి మొక్కలు నాటడాన్ని ప్రోత్సహించడానికి బోధన, బోధనేతర సిబ్బందికి కూడా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి : బిజెపి



ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నేతలు మార్నెని పణీంద్ర, ధర్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జులై 16 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కురుమనగర్, ఉప్పల్ హిల్స్‌లో కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గురువారం పలువురు బిజెపి నేతలు గురువారం డిప్యూటీ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీంద్ర, సీనియర్ నేతలు శామీర్‌పేట ధర్మారెడ్డి, తీగ విఠల్‌రావు, యు.బి.చారి తదితరులు మాట్లాడుతూ ఉప్పల్ ప్రాంతానికి సుమారు 3 కిలో మీటర్ల దూరంగా ఉందని, 2 వేల మంది ఓటర్లు ఉంటారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కురుమనగర్, ఉప్పల్ హిల్స్ ప్రాంతంలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై డిసి ఆనంద్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## మన డిజిటలీకరణ కేవలం 20 శాతం మాత్రమే -సహాయ కేంద్రాల వద్ద తగిన సేవలు

**ఎల్.బి.నగర్, జులై 16 ప్రభాతవార్త:** ఎల్.బి.నగర్ నియోజకవర్గ నివాసులారా, ఆర్‌డబ్ల్యుఎలు, ఎస్ఎల్ఎఫ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులారా, గణన పత్రాల సమర్పణ గడువును ఈసీఐ ఆగస్టు 3వ తేదీ వరకు పొడగించిందని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్‌మహాతో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల డిజిటలీకరణ 50 శాతం నుండి 70 శాతం మధ్య ఉండగా, మన డిజిటలీకరణ కేవలం 20 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ తరుణంలో మనం ఏమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. మా ఫారాలు నింపే బృందాలు సహాయ కేంద్రాల వద్ద మీకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. నివాసాల వద్దకు వచ్చి కూడా సేవలు అందిస్తారని అన్నారు. వీలైనంత త్వరగా గణన పత్రాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కార్యాలయాన్ని సందర్శిస్తున్న మంత్రి అడ్లూరి

**మలక్ పేట, జులై 16, ప్రభాతవార్త:** మలక్ పేట నల్గొండ చౌరస్తాలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం భవనం అవరణాలో ఉన్న బదిరుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిపరిశీలించారు. అదేవిధంగా సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడి వెళ్లారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న స్వామి హుండీ లెక్కింపు



**మల్కాజిగిరి జులై.16.ప్రభాతవార్త** మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను గురువారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షం లో లెక్కించగా 3,87,746( మూడు లక్షల ఎనభై ఏడు వేల ఏడువందల నలభైఆరు రూపాయలు మాత్రమే) 59 రోజుల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎబి రవీంద్ర రెడ్డి తెలిపారు.హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎబి రవీంద్ర రెడ్డి ,అర్చకులు ముడుంబై వెంకట రమణా చార్యులు,డాతులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్ అభివృద్ధి కమిటీ మాజీ సభ్యులు సానాధి శంకర్ , హేమంత్ కుమార్, సంజయ్ కుమార్, రత్నాకర్ ,భక్తులు వెంకట చారి , రమేష్,రత్నమాల, గాంధీ, కె వి ఎస్ ప్రసాద్ ,శ్రీదేవి, సూర్యకుమారి, మాధవి,వి సరిత, ప్రతిభ,హరినాథ్ గౌడ్, తులసి చైనా రాణి, అల్లూరి శ్రీనివాస్ యాదవ్, లక్ష్మీ,పద్మంజలి,మీఅంజుల, వరలక్ష్మి, దివ్య, హర్షిత, శ్రీదేవి, సీతాలక్ష్మి,రామలక్ష్మి,నారాయణమ్మ, ఎల్లమ్మ,నాగమల్లేశ్వరి, శ్రీలక్ష్మి,గంగా,సాయి, పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌లో కనుల పండువగా జగన్నాథ్ రథ యాత్ర



జగన్నాథ రథ యాత్రలో పూజలు చేసి ప్రారంభించిన పారిజాత

**సరూర్‌నగర్, జులై 16 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని బడంగ్‌పేట్ డివిజన్ శ్రీ సాయిబాలాజీ ఫేస్-2 కమ్యూనిటీహాల్‌లోనున్న శ్రీశ్రీ చైతన్య నీతాయి జగన్నాథ్ మందిర్ ఆధ్వర్యంలో రథ యాత్ర కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి జగన్నాథునికి పూజలు నిర్వహించి రథ యాత్రను ప్రారంభించారు. అనంతరం రథ యాత్ర సాయిబాలాజీ కాలనీ నుండి గాయత్రీ హిల్స్, బడంగ్‌పేట్ మెయిన్ రోడ్డు, శ్రీ విద్యాటౌన్‌షిప్, సాయిబాలాజీ ఫేస్-1 కాలనీల గుండా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో శ్లోక ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ జైపాల్‌రెడ్డి, ఆధ్యాత్మిక గురువు చంద్రదాస్, కాలనీల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి : పరమేశ్వర్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డిని కలిసి సత్కరిస్తున్న ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం నేతలు

**ఉప్పల్, జులై 16 ప్రభాతవార్త :** ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ఆర్యవైశ్య కమిటి నేతలు పరమేశ్వర్‌రెడ్డిని కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం నేను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆర్యవైశ్యులకు ఏదైనా సమస్య వస్తే నా దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటి నేతలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు బిక్కుమళ్ల రమేష్ గుప్తా, అధ్యక్షులు బిక్కుమళ్ళ సంతోష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పాలడుగు సంపత్ గుప్తా, కోశాధికారి రేణిగుంట కిరణ్ కుమార్ గుప్తా, బిక్కుమళ్ళ సంతోష్ గుప్తా, సంయుక్త కార్యదర్శి తోడపనూరి మహేష్ గుప్తా, నేతలు మాశెట్టి రాఘవేంద్ర గుప్తా, నరేష్ గుప్తా, జగన్ గుప్తా, రవి, కాసం, సంతోష్ గుప్తా, శ్రీనివాస్ గౌరిశెట్టి, నవీన్ గుప్తా.నవీన్ గుప్తా, శ్రీకాంత్, శ్రీనివాస్, హరీష్, ఉప్పు శంకర్, వేణు గోపాల్, శివ కృష్ణ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో శ్రీనిధి సాంకేతిక మహోత్సవం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న యాజమాన్యం

**నాచారం, జులై 16 ప్రభాతవార్త :** శ్రీనిధి విజ్ఞాన, సాంకేతిక విద్యాసంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక మహోత్సవం ఘన విజయాన్ని సాధించింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 75కు పైగా విద్యాసంస్థల నుంచి 940 మందికి పైగా విద్యార్థులు, 400కు పైగా బృందాలుగా పాల్గొని తమ వినూత్న ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు మొత్తం రూ.7 లక్షల నగదు బహుమతులను అందజేశారు. ఈ మహోత్సవంలో డిజిటల్ సాంకేతికత, కంప్యూటర్ నైపుణ్యాలు, అంతర్జాల భద్రత, ప్రోగ్రామింగ్, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన ఐదు ప్రధాన విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అలాగే శిక్షణ శిబిరాలు, సాంకేతిక అవగాహన కార్యక్రమాలు, నిపుణులతో ముఖాముఖి సమావేశాలు, నిరంతర ఆవిష్కరణ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించారు.ప్రారంభోత్సవానికి ప్రముఖ సమాచార సాంకేతిక రంగ నిపుణులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ముగింపు కార్యక్రమంలో పలువురు పారిశ్రామిక రంగ ప్రతినిధులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యాసంస్థ డీన్ డా. అరుణ వరణాసి, సమూహ శిక్షణా విభాగం సంచాలకుడు యల్లపు వాసుదేవరావు, సహాయ డీన్ డా. మను గుప్తా మార్గదర్శకత్వంలో అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేశారు. విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు, పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి, వినూత్న ఆలోచనలకు రూపం ఇవ్వడానికి ఈ మహోత్సవం సమర్థవంతమైన వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

## నూతన డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభం



**వనస్థలిపురం. జులై. 16.ప్రభాతవార్త** బియన్ రెడ్డి డివిజన్ పరిధి లోని వైదేహినగర్ నార్త్ కాలనీలో రోడ్ నెంబర్ 12/1లో ప్లాట్ నెంబర్ 256 నుండి ప్లాట్ నెంబర్ 260 వరకు ఎల్బీనగర్ నియోజక వర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహాయ సహకారాలతో గతంలో జలమండలి ఎండి ద్వారా మంజూరైన నిధులతో, గురువారం బి.యన్.రెడ్డి డివిజన్ జలమండలి మేనేజర్ భాను ప్రకాష్ రెడ్డి గారి సమక్షంలో వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు మరియు వారి అసోసియేషన్ సభ్యులతో కొత్త డ్రైనేజ్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు..ఈ సందర్భంగా వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల రాంబాబు మాట్లాడుతూ, వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున మరియు కాలనీవాసుల తరపున, జలమండలి నుండి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జలమండలి ఎండి, జిఎం, డిజిఎం, జలమండలి మేనేజర్ భాను ప్రకాష్ రెడ్డి,బి.ఎన్.రెడ్డి డివిజన్ బిఆర్ ఎస్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు.కొత్త డ్రైనేజ్ పైప్ లైన్ వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని వైదేహి నగర్ నార్త్ కాలనీలోని , రోడ్ నెంబర్12/1 లో నివసించే ఇంటి యజమానులు మరియు అసోసియేషన్ సభ్యులు రాజేందర్ రెడ్డి లక్ష్మీనారాయణ నాగరాజా అన్నం రాజు శ్రీనివాస్ చక్రధర్ రామనాథరెడ్డి కోటేశ్వరయ్య వెంకట్రామిరెడ్డి రాములు నరసింహ సీతా మెహర్ కె ఎస్ ఆర్ ఆంజనేయులు శేషగిరిరావు విద్యాసాగర్ నూరుద్దీన్ నవీన్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జులై 16 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం జోనల్ కమిసనర్ రాధిక గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు,పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌళిక వసతుల అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించి, పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. దీనిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, పిల్లి నాగరాజు, జెట్ట కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.